క్లుప్తంగా

ఉత్సాహంగా..

నెల్లూరు సిటీ: మైపాడు గేట్ వద్ద గణేశ్ విగ్రహ నిమజ్జనాన్ని మైపాడు గేట్ మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. మేళతాళాలతో ఊరేగించి నిమజ్జనం చేశారు.

కామన్ అకౌంటింగ్ సిస్టమ్‌పై అవగాహన



మాట్లాడుతున్న గుర్రప్ప

నెల్లూరు (వీఆర్సీ సెంటర్): కామన్ అకౌంటింగ్ సిస్టమ్‌పై అవగాహన కార్యక్రమాన్ని కేంద్ర సహకార బ్యాంక్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఓ గుర్రప్ప మాట్లాడారు. అవగాహన కార్యక్రమాలను మూడు రోజుల పాటు నిర్వహించనున్నామని చెప్పారు. ఉలవపాడు మహిళా రైతు సంఘానికి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌ను అందజేశారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): విద్యుత్ ప్రమాదాలపై వినియోగదారులు, రైతులకు అవగాహన కల్పించనున్నామని ఎస్‌ఈ విజయన్ పేర్కొన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించే పోస్టర్లను నగరంలోని విద్యుత్ భవన్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించనున్నామని వివరించారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ 14న జిల్లాకు రాక

నెల్లూరు(క్రైమ్): రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి జిల్లాలో ఈ నెల 14న పర్యటించనున్నారు. ఆ రోజు ఉదయం ఆరు గంటలకు ఆమె కడప నుంచి రోడ్డు మార్గాన బయల్దేరి తొమ్మిది గంటలకు నెల్లూరులోని ఆర్ అండ్ బీ అతిథి గృహానికి చేరుకుంటారు. ఉదయం 11 గంటలకు వెంకటాచలం మండలం చెముడుగుంటలోని జిల్లా కేంద్ర కారాగారానికి చేరుకుంటారు. జైలును పరిశీలించిన అనంతరం మహిళా ఖైదీలతో సమావేశమవుతారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఆమె రోడ్డు మార్గాన తాడేపల్లికి పయనమవ్వనున్నారు.

అపరిచితులు సంచరిస్తే తెలపండి

ముత్తుకూరు : కృష్ణపట్నం పోర్టు, ఇతర ప్రాజెక్టులు, పరిశ్రమలు ఉన్నందు వల్ల ఎక్కడైనా అపరిచితులు సంచరిస్తున్నట్లు అనుమానం కలిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కృష్ణపట్నం సీఐ రవినాయక్ విజ్ఞప్తి చేశారు. ముత్తుకూరులోని సర్కిల్ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను కూడా పోలీసుల దృష్టికి తీసుకొస్తే పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. పోలీసులకు సహకారం అందించాలన్నారు. సర్కిల్ పరిధిలో వినాయకుని విగ్రహాల నిమజ్జనానికి మూడు చోట్ల ఏర్పాట్లు చేశామన్నారు. ఈ ప్రదేశాల్లో పోలీసుల బందోబస్తు ఉందని వెల్లడించారు.

ప్రతిభావంతులకు నగదు బహుమతులు

పొదలకూరు : మండలంలోని విరువూరు జెడ్పీ హైస్కూల్లో 2023–24 విద్యా సంవత్సరంలో టెన్త్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు గ్రామానికి చెందిన బి.వెంకటేశ్వర్లు బుధవారం నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

పొదలకూరు : మండలంలోని కనుపర్తి గ్రామంలో గణేశ్ ఉత్సవాల్లో భాగంగా బుధవారం బాణసంచా పేలుస్తున్న క్రమంలో గడ్డివామికి నిప్పంటుకుని దగ్ధమైంది. గ్రామస్తులు ఎస్సై హనీఫ్‌కు సమాచారం అందించడంతో వెంటనే ఆయన అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేసి గ్రామానికి రప్పించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎస్సై వివరించారు.

అభివృద్ధి పథంలో సహకార బ్యాంక్

ఇందుకూరుపేట : మండలంలోని నిడిముసలి సహకార బ్యాంకు(పీఎస్‌సీఎస్) అభివృద్ధి పథంలో నడుస్తోందని బ్యాంక్ ఇన్‌చార్జి పర్సన్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు బ్యాంకులో రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకును త్వరలో కంప్యూటీకరణ చేస్తామని చెప్పారు. రైతులు ఆధార్, మొబైల్, పొలం సంబంధిత పత్రాలను అప్‌డేట్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ ప్రతాప్‌కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నిమజ్జన సందడి



మహిళల కోలాట ప్రదర్శన



సందడే.. సందడి

వినాయక చవితిని పురస్కరించుకొని తాత్కాలికంగా ప్రతిష్ఠించిన బొజ్జగణపయ్యల నిమజ్జనాన్ని కోలాహలంగా బుధవారం నిర్వహించారు. సింహపురిలోని దారులన్నీ గణేశ్‌ఘాట్, రంగనాయకులపేటలోని బ్యారేజీతో పాటు జాఫర్‌సాహెబ్‌కాలువ, సర్వేపల్లి కాలువల వైపు సాగాయి. గంగా హారతులు, పండరి భజనలు, కోలాటాలు, బాణసంచా వెలుగులు, విద్యుద్దీపకాంతులు, కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాల నడుమ స్వర్ణాల చెరువు శోభిల్లింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

– నెల్లూరు(బృందావనం)





గణేశ్ ఘాట్ వద్ద కోలాహలం





క్రేన్ సాయంతో విగ్రహ నిమజ్జనం



జలహారతిని నిర్వహిస్తున్న వేదపండితులు





ట్రాక్టర్‌లో తరలివస్తున్న గణనాథుడు

ఘన సన్మానం

నెల్లూరు(బృందావనం): విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి పిలుపు మేరకు ప్రథమంగా విచ్చేసిన క్రాంతినగర్‌లోని శివకేశవులు దేవస్థానానికి చెందిన పంచముఖ ఆంజనేయ అభయగణపతి భారీ విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ దరిశిగుంట పెంచలయ్య, రాచపూడి చిన్నవెంకటయ్య, సభ్యులు యనమల గోవిందు, మల్లికార్జునరావు, మునిరాజ్, చిట్టిబాబు, వెంకటేష్ తదితరులను సత్కరించారు.

హరనాథపురంలో అన్నదానం



నెల్లూరు సిటీ: వినాయక చవితి మహోత్సవాలను పురస్కరించుకొని హరనాథపురంలోని సర్వేపల్లి కాలువ కట్టపై అన్నదానాన్ని బుధవారం నిర్వహించారు. సురేష్, అంకయ్య, హరి తదితరులు పాల్గొన్నారు.

చింతారెడ్డిపాళెంలో..

వినాయక చవితి మహోత్సవాలను పురస్కరించుకొని చింతారెడ్డిపాళెంలో అన్నదానాన్ని ఫ్రెండ్స్ సర్కిల్ సెంటర్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. గణనాథుడి విగ్రహాన్ని ఈ నెల 15న నిమజ్జనం చేయనున్నామని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సందీప్, రత్నయ్య, నానీ, సుకేష్, సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శోభాయాత్ర



నెల్లూరు(బృందావనం): గాంధీబొమ్మ సెంటర్ సమీపంలోని శివాజీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహ నిమజ్జన శోభాయాత్రను వేడుకగా బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కోలాట ప్రదర్శనను జరిపారు. కార్యక్రమంలో స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్, శివాజీ సెంటర్ మిత్రమండలి, విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, సుబ్రహ్మణ్యం, రంగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే

• ఖలీల్ అహ్మద్



ఖలీల్ అహ్మద్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని డిప్యూటీ మేయర్, గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ అభ్యర్థిగా పోటీ చేసిన ఖలీల్ అహ్మద్ ఆరోపించారు. ఈ మేరకు సాక్షితో బుధవారం ఆయన మాట్లాడారు. భారీ వర్షాలు, వరదలొస్తాయని వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరించినా, ప్రభుత్వం పట్టించుకోలేదని, దీంతో ప్రజలకు ఇంత కష్టమొచ్చిందని చెప్పారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో లక్షలాది మంది ప్రజలు వరదల్లో చిక్కుకుపోయారని తెలిపారు. సాయమందించే విషయంలో సీఎం, మంత్రులు చిత్తశుద్ధితో పనిచేయలేదని విమర్శించారు. ప్రచారంపై చూపిన శ్రద్ధను బాధితులకు న్యాయం చేయడంపై పెట్టలేదని ఆరోపించారు. వరదలకు నాటి సీఎం జగన్‌మోహన్ రెడ్డే కారణమంటూ వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలుసునని, బాధితులకు న్యాయం చేసేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని ప్రభుత్వానికి హితవు పలికారు.

గణనాథుడికి పూజలు



నెల్లూరు సిటీ: కొండాయపాళెం రోడ్డులోని భవానీ స్కై టవర్స్ అపార్ట్‌మెంట్‌లో ప్రతిష్ఠించిన గణనాథుడికి విశేష పూజలు నిర్వహించారు. లడ్డూ వేలాన్ని బుధవారం నిర్వహించగా, రూ.80 వేలకు దేశ్‌పాల్‌సింగ్ దక్కించుకున్నారు. ఉత్సవాల్లో చివరి రోజున సాంస్కృతిక కార్యక్రమాలు, ఉట్టి మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం గణేశ్ ఘాట్ వద్ద నిమజ్జనం చేశారు. వంశీకృష్ణ, శ్రీనివాసులు, రమేష్, ప్రభాకర్‌రెడ్డి, రామకృష్ణ, ప్రదీప్, వెంకట్ తదితరులు పర్యవేక్షించారు.

కార్మికుల హక్కులను పరిరక్షించాలి



ర్యాలీని నిర్వహిస్తున్న నేతలు

నెల్లూరు (వీఆర్సీ సెంటర్): కార్మికుల హక్కులను పరిరక్షించేలా చట్టాలను అమలు చేయాలని సీపీఎం నెల్లూరు నగర కార్యదర్శివర్గ సభ్యుడు నాగేశ్వరరావు పేర్కొన్నారు. నగర పండ్ల మార్కెట్ హమాలీ సీపీఎం శాఖ మహాసభను పురస్కరించుకొని చిన్నబజార్‌లో ర్యాలీని బుధవారం నిర్వహించారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఎర్ర జెండాను పార్టీ నెల్లూరు నగర కమిటీ సభ్యుడు అత్తిమూరి శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాలాజీనగర్‌లో అక్టోబర్ 20, 21వ తేదీల్లో నిర్వహించనున్న నగర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. పార్టీ నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యుడు నరసింహ, పండ్ల మార్కెట్ శాఖ కార్యదర్శి జమ్ముల శ్రీనివాసులు, నేతలు బసవయ్య, సౌందర్‌రాజన్, మాల్యాద్రి, సుబ్బయ్య, రేవతిపతి, లక్ష్మణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు కారకుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన నిందితుడ్ని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బంగ్లాతోటకు చెందిన హరనాథ్ (42)కు ఉద్యోగమిప్పిస్తానని నమ్మించి రూ.లక్షల్లో నగదు తీసుకొని అదే ప్రాంతానికి చెందిన ప్రేమ్‌చంద్ మోసగించారు. ఉద్యోగం రాకపోవడం, బ్యాంకుల నుంచి ఒత్తిళ్లు అధికమవడంతో మనస్తాపానికి గురైన హరనాథ్ ఈ నెల ఐదో తేదీ రాత్రి తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ప్రేమ్‌చంద్ మోసం కారణంగానే హరనాథ్ ఆత్మహత్యకు పాల్పడ్డారనే అంశం పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో నిందితుడ్ని అరెస్ట్ చేశామని నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా తెలిపారు.

బేల్దారి అదృశ్యం



రామకృష్ణ

నెల్లూరు(క్రైమ్): పనులకెళ్లిన బేల్దారి అదృశ్యమైన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ పరిధిలోని నాలుగో మైలులో రామకృష్ణ, సాయికుమారి దంపతులు నివాసం ఉంటున్నారు. పనుల నిమిత్తం నగరంలోని తడికలబజార్ సెంటర్‌కు ఈ నెల రెండున ఆయన వచ్చారు. అక్కడి నుంచి ఆయన అదృశ్యమయ్యారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఆయన భార్య ఫిర్యాదు చేశారు. సాంకేతికత ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. రామకృష్ణ ఆచూకీ తెలిసిన వారు 94407 96310, 94407 96306 నంబర్లను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా కోరారు.

పౌష్టికాహార మాసోత్సవాలు



నెల్లూరు సిటీ: పౌష్టికాహార మాసోత్సవాలను పురస్కరించుకొని గాంధీ గిరిజన కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మీరాజ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఎన్‌ఎం సుజాత, ఆదిలక్ష్మమ్మ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయం వద్ద ధర్నా రేపు



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(బారకాసు): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నగరంలోని ఆర్టీసీ ఆర్‌ఎం కార్యాలయ ఎదుట ధర్నాను శుక్రవారం నిర్వహించనున్నామని ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎమ్మార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. వివిధ డిమాండ్లను పరిష్కరించాలంటూ ధర్నాను చేపట్టనున్నామని తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమౌళి, గౌరవాధ్యక్షుడు శంకరయ్య, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ రామసుబ్బయ్య, వేణుగోపాల్‌నాయుడు, జాయింట్ సెక్రటరీ లక్ష్మీపతి పాల్గొన్నారు.

లడ్డూ @ రూ.2.8 లక్షలు



నెల్లూరు(బృందావనం): వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా బాలాజీనగర్‌లోని రైస్‌మిల్లు సెంటర్‌లో ప్రతిష్ఠించిన గణనాథుడి లడ్డూ వేలాన్ని నిర్వహించారు. రూ.2.8 లక్షలకు లడ్డూను దాసరి అజంత్, ప్రశాంత్‌రెడ్డి దక్కించుకున్నారు.

పారిశుధ్య కార్మికులకు వసతులు కల్పించాలి



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన

నెల్లూరు(బారకాసు): విజయవాడలో వరద బాధితులను ఆదుకునేందుకు వెళ్లిన ఇక్కడి మున్సిపల్ కార్మికులకు మెరుగైన వసతులను కల్పించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. జిల్లా నుంచి దాదాపు 500 మంది మున్సిపల్ కార్మికులను పంపారని, అయితే వారికి ఎలాంటి రక్షణ పరికరాలను ఇవ్వలేదని ఆరోపించారు. ఈ క్రమంలో బురదలో పనిచేయడంతో కాళ్లు, చేతులకు పుండ్లు వచ్చి, పలువురు అనారోగ్యానికి గురయ్యారని తెలిపారు. సమయానికి భోజనం, అల్పాహారాన్ని సైతం అందించడంలేదని, ప్రశ్నిస్తే మెమోలిస్తామంటూ కొందరు అధికారులు బెదిరిస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ కార్మికులకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేయడంతో పాటు వేతనంతో కూడిన ఐదు రోజుల సెలవులివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంహెచ్‌ఓ చైతన్యను వినతిపత్రాన్ని అందజేశారు. నేతలు కామాక్షమ్మ, సునీల్, వజ్రమ్మ, భారతి, శ్రీను, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.